# కాశ్మీర మజిలీలు

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు

## — ప్రాణములేని బస్సుప్రయాణము —

ఎట్టకేలకు బస్సు కదలినది. మట్టిదిబ్బను శైలింజను జేయు కెట్టిదో ఈ బస్సునకు చలనశక్తి నొసగుటయును అట్టిదేయని ఊహించియుంటిని. జాతకరీత్యా ఎంత పరిశీలించినను నాటినిశి పయనముసాగునను ఆశ కెట్టి యాధారమును అగపడలేదు. కావున బస్సు కదలినను, కదలినది బస్సో లేక గుండెలో దిర్రిరదిరుగు భావప్రపంచకమో యను సందియము కలిగినది. రోడ్డున కిరువంకలగల చెట్లు వెన్కకు తరలిపోవుట గని, చిన్ననాటి జాగ్రఫీపరిజ్ఞానమును మనసున నొకపరి నెమరుచ్చుకొంటిని. బస్సు నడచుచున్నదని ఇన్ఫరెన్స్‌వలన గ్రహించితిని. “జయపరమేశ్వరా!” యను వాక్కు హృదయమున ప్రతిధ్వనించినది.

బస్సు కొంతదూరము సాగినపిదప క్రిందినుండి ఏదో వికృతశబ్దము వినవచ్చినది. టైరులలో నేవో పిల్లులు ప్రవేశించి అల్లరిచేయుచున్నట్లు ప్రత్యేకమైన ఆ శబ్దమువలన యోచింపవలసివచ్చినది. తోడ్తోడనే గుండెలోకూడ కలవర ముదయించినది. “హా! హతవిధీ! హా! మాలదైవమా!!” యను వాక్కులు నాకు తెలియకయే నా నోటినుండి వెడలినవి. దుర్గతి “దూ! దూ!!” అని పిలచుచుండ “లావొక్కింతయు లేని” మాబస్సును రక్షించే పరంధాము డెవడు? “వరప్రసాదివంటి ఈబస్సు మా కెట్లు దాపురించినది దైవమా!” అని లోలోన గుందుచుంటిని. ఆ వేదనము, ఆవేశము హృదయకవాటమును భేదింపదలపడినవి. స్వగతమున మిక్కుటముగ బాధపడు పాత్రధారివలె నల్దిక్కుల నుఱుకలెత్తి ఒక్కటే ఒక పిల్లిమంత్రమును ఎదుటివారు హడలిచచ్చునట్లు వెన్కకు వేసి మనసును కొంతవఱకు కుదుటబఱచుకొన దలచితిని. కాని ఇంతపని చేయుటకు బస్సులో చోటేదీ? కట్టురాదు చుట్టుమాత్రము చిందులు త్రొక్కపోట్లగిత్తవలె, బోనులో మిడిసిపడు పెద్దపులివలె హృదయమందలి తీవ్రోద్వేగము అందే విజృంభింపదొడగినది. ఇట్టి దారుణప్రవిదారుణము సహయాత్రికుల హృదయారణ్యాలందుగూడ జరుగుచున్నదో లేదో చెప్పజాలను. నా అదలుపాటే బస్సుకు తగిలినదేమో! కాని, భారతభూమియం దెన్నెన్నో చోటులందు బస్సుప్రయాణము చేసితిని. ఇట్టి ముసల మెన్నడు దాపురించియుండలేదు. ఏ శకునపక్షియైన సహప్రయాణీకులలో దూరియుండెనేమో! వాని స్పర్శ మంత్రశక్తివలె పనిచేయుచు బస్సుయొక్క గుండెకాయ నాపివేయుచున్నదేమో! గొంతుకలో తులసినీరు పడుచుండగనే ఊపిరి వెడలిపోయినట్లు, మనసులోని ఊహలు తెమలకమున్నె, గుండెలోని దడకువలసినంత అవకాశము లభింపకమున్నె మా బస్సు...చప్పున ఆగిపోయినది. కొన్ని నిముసములకు మున్ను అధోభాగమున వినవచ్చిన వికృతశబ్దము బస్సు నిప్పు డధోగతికి దెచ్చినది. ఇది ఆగగనే మా సీటులో కూర్చున్నవారము (ఒక్కరైన మిగులక) “హా! హతోస్మి!” అని పడిపోతిమి. జాతకము ఫలించితీఱినది. కొంతసేపటికి తెప్పిరిలి నలువంకల జూచితిమి. సాంద్రమైన చెట్లనీడలు తోచినవి. అమృతసరమునుండి ఎంత దూరము వచ్చితిమో, లాహో రచటి కెంతదూరమందున్నదో ఎఱుగుట కెట్టియాధార మగపడలేదు. దట్టమైన చెట్లజొంపములో నేదారిగాని ఏతెన్నుగాని అగపడనే లేదు.

భూగోళమున నేమూలలో నీ యర్ధరాత్రివేళ బస్సు దిగబడినదో తెలిసికొనుట కెట్టి యాధారము అగపడలేదు. ఆకసమున మబ్బు అలముకొనియున్నది. రోడ్డునకు రెండువంకల దట్టమైన చేలున్నవి. అమృతసరమును విడిచి ఏకొద్దిమైళ్లు మాత్రమో వచ్చితిమని

ఊహింపగలిగితిని. పాతిక మైళ్లను ముందునిలిపి, నిశాచరులతో దోబూచులాడుకొనుచని బస్సు మమ్మందు పడవేసినది. "అమృతసరమునుండి మఱొక బస్సుకై తడయుట మేలుకాదా?" అని తోడియాత్రికులనిరి. అవును! ప్రారబ్ధము తలపై దంచుచున్నను, ఏదో యాశ కల్పించుకొని చావలేక మనుజుడు బ్రతికియుండును. కాని ఏయాశకైనను కాల్సేతు లుండవలెను గదా! వట్టియూహకుగాని, వెఱ్ఱితలపునకు గాని అర్ధాంగియగుచో, ఆశ కనజాలు ముద్దియ దొద్దియనుండదు. గంటలకొలది పడియుండి వేఱు గతిగానక యెక్కిన బస్సు ఇంతకు దెచ్చినపుడు రాబోవు బస్సు ఏదరిజేర్చునో యని యోచించునపుడు మనసు రవులకపోవునా? రగులుచున్న మనసున నాశకు చోటేది? హద్దులేని సహనము చూపుచుంటినని మనమున నన్ను నేనే మెచ్చుకొనుచు మొద్దువలె పడియుండుటకంటె చిత్తమును కొంచము వెచ్చగా నిచ్చి వేఱుదారిబట్టుటే మేలని యెంచితిని. ఆసమయమున చేయవలసిన కర్తవ్యము మెల్ల మెల్లగా లాహోరుదిక్కుగ నడచిపోవుటే కదా! ఈనడక యెంతవఱకు సాగునోయని యోజింపగడంగిన నందే చతికిలపడెదనని గ్రహించితిని. ఎట్టిచింతను మనసుపై వాలనీయక, "బయల్దేరు"మని పొట్టిపిచికిని హెచ్చరించితిని. బుడంకాయి కొంచము తటపటాయించినాడు కాని, మాటేమియు బలుకక పిదప రోడ్డును బట్టినాడు. మా పోకనుగని బోండా "బాబూజీ! ఈసమయమున లాహోరు నడచిపోలేరు. ఏల వృథా ప్రయాస? అడ్డుదారినిపోవుచో మాయూరిచటికి మైలుదూరమున మాత్రమున్నది. నాతో రండు. రాత్రికి మాయింట నుండురుగాక!" అనినాడు. ఒకరి యాతిథ్యమునందుట కంతగా యిష్టపడువాడను గాను. కాని దీనిని పడయుటే తప్పని సరియైన పరిస్థితు లీ ప్రయాణములో దాపురించినవి. ఏమి చేతును? పంజాబులోని పల్లెను పరిశీలించు తరుణము లభించుచున్నదను యోచన అనంతరము మనసున మెల్లగ ప్రాకసాగినది. తెన్నుకై తొట్రుపడుచు, జరిగిన భంగపాటునకై నిట్టూర్పులూర్చుచు నిట్టితరుణమును పోగొట్టుకొనుట తెలివిమాలినపనియని గ్రహింపగలిగితిని. చీకటిలో చిక్కుడొంకలలో పడు చిక్కులు చిత్తమున చిరపాతములను చిత్రించునను ఆశకూడ చిత్తమున నుదయించినది. నిముషము యోజించుచు నిలిచియుంటిని. "యోచనయేల? రండు" అని బోండా పలికి దారిదీసినాడు. ఏ చింత లేని బుడంకాయి వాని వెంటబడినాడు. మెల్ల మెల్లగ నేగూడ అడుగులుకదపి పొట్టిపిచికి చేతినుండి సూట్కేసు తీసుకొని బోండా మూటగొనుమని వానితో చెప్పితిని. కాని బోండా తనమూటను బుడంకాయి కిచ్చుట కిష్టపడినాడు కాడు. లోని సరుకును పొట్టిపిచికి పొట్టబెట్టుకొనునని ఈత డదలియుండునని తలచి "పరవాలేదు. ఇయ్యండి" అని బోండాతో పలికితిని. అనుచుండగనే బుడంకాయి దానిని దీసికొని తలపై నిడికొనినాడు.

తోడిప్రయాణికులు రోడ్డుప్రక్క వేచియుండిరి. మేముమాత్రము కదలితిమి. కాని బోండా రోడ్డును చారుగ వదలినాడు. ప్రక్కనున్న చేనులో పడినాడు. మే మిరువురముగూడ నట్లేపడితిమి. "జయ్! పరమేశ్వరా!" యని భారము సగము దేవునిమీదను సగము బోండామీదను వేసితిమి. చేనుగట్టైన సరిగా లేదు. నిలువెత్తుననున్న మొక్కలను త్రొక్కుకొని నడువవలసివచ్చినది. నడుము నడుమ కంపలు, పుట్టలు ప్రత్యక్షమైనవి. పుట్టలోని సుబ్బారాయుడు ప్రాణము లుండనిచ్చునో ఉండనీయడో యను యడలు గుండెలను దడదడలాడింప దొడగినది. అడుగులు తడబడినవి. కాని ఏ భయములేక నడచు బోండాను జూచి ధైర్యము దెచ్చుకొంటిని. ఈరీతి పయనము వీని కలవాటుకాబోలు! ఉండియుండి ఏదో పాటలోనిమాటను రాగధోరణితో విసరుచు, కుశలప్రశ్నలు వేయుచు ఆయాస మధికమైనపు డూరకొని మెల్లగ నడచుచు బోండా క్రొత్తదృశ్యమును ప్రదర్శించినాడు. లఘువుగమాత్రము వానికి ప్రత్యుత్తరముల నొసగుచున్నాను.

ఇది మూడంకముల చరిత్రాత్మక నాటకము. ఇందలి కథ తన కుమారుని బలియిచ్చి ప్రభువు కుమారుడైన ఉదయసింహుని గాపాడి, పున్నా ఉదయసింహుని సింహాసనాసీనుని చేయుట. మాతృహృదయమును అతి కష్టముతో నణచుకొని మహోన్నత త్యాగమొనర్చి ప్రపంచ చరిత్రయందే యత్యున్నత స్థానమాక్రమించి రత్నమువలె ప్రభలనీనుటచే దీనికి అనువాదకులు రత్న ప్రభ యని పేరిడుట సమంజసము. ఈ చిన్న పుస్తకమును నాటక మనుటకన్న కథ సంభాషణ రూపమున చెప్పబడిన దనవచ్చును. మొదటి గ్రంథకారుడు నాటక లక్షణముల పాటించినటుల గనపడదు. అనువాదము సరళముగను రసవంతముగ నున్నది. పాత్రోచిత భాషకూడ వాడుట బాగున్నది.

### సీతపెండ్లి ఇతర నాటకములు.

ఇదియు శ్రీ ఏ. ఎస్. పి. అయ్యరుగా రాంగ్లమున రచించినదే. దీనిని కాటూరి వేంకటేశ్వరరావు గారను వదించిరి. ఇదియు వావిళ్ల వారిచే ప్రకటితము. వెల 0-12-0.

ఇందు 'సీతపెండ్లి', 'ధర్మపథము', 'భావ బంధనము' అను మూడు 'నాటకములు' గలవు. మొదటిది సంభాషణలో జరిగించిన కథ. తక్కిన రెండును కేవలము ప్రశ్నోత్తరములు. మొదటిదానికే 'నాటక' మనుట సరిగాపొసగదు. తక్కినవికూడ నాటకము లనుటలో గ్రంథకర్తగారి యుద్దేశము తెలియకున్నది.

నీతి నియమములను వీడి బాధ్యత వహింపక పురుషుడు సంసారమును నధోగతికి దీనికొనివచ్చుచున్న, తెలివితేటలుగల యిల్లాలు శ్రద్ధవహించినచో కుటుంబవ్యవహారముల నెటుల చక్కబెట్టగలదో వారందరి కేవిధమున సౌఖ్యము గూర్పగలదో 'సీతపెండ్లి'లో వ్రాసిరి.

'ధర్మపథము'నందు సాధారణ గృహస్థునికి పరార్థముపట్ల గలుగు సందేహములు, దానికి తగిన సమాధానములు—పెక్కు విషయముల నతి సులభముగ తెలుపునట్టి ఆధ్యాత్మిక సంగతులు—గలవు.

'భావబంధనము' ఈ ప్రశ్నోత్తరములే కాని ఇందు కథావస్తువు ఇష్టమువచ్చినట్లు నడుపబడి చెడిపోయినది. ఆధ్యాత్మిక బోధనలను విన్న రంగరాజు వైరాగ్యమువహించి, భార్యను తనదారికి త్రిప్ప ప్రయత్నించి యామె వినక తప్పుడుదారి త్రొక్కయామెను హత్యచేసి తాను ఉరిశిక్ష పొందును. కథ నీ విధముగ ప్రారంభించి ముగించుటలో రచయిత ఆశయము బోధకముగాదు.

ఇది చక్కని వ్యావహారిక భాషయం దనువదించిరి. చదివినవారికిది యనువాదమువలె గాక యాంధ్ర సృష్టియనియే తోచును. ఎల్లరు చదువదగినది.

### రాజయోగము

హైందవుల ఆధ్యాత్మికౌన్నత్యము అసదృశమని పాశ్చాత్య ప్రపంచమునచాటి హిందూమతమున కెన లేని గౌరవాదరములను గొనితెచ్చిన భారతమాత ప్రసిద్ధపుత్రుడు స్వామి వివేకానంద. వారు అమెరికా యందున్నపుడు రాజయోగముపై నచటచట యిచ్చిన యుపన్యాసములనే ఇందలి ప్రథమభాగముగా మదరాసు, రామకృష్ణ మఠమువారు ప్రచురించిరి.

'ప్రత్యక్షానుభూతిని గల్గించుటయే రాజయోగాతిశయము. చిత్తైకాగ్రతకల్గుట కుపాయ మేమి? అనంతర మంతరంగమునందలి పరమరహస్యముల నెట్లుగ్రహింపగలము? అటువెనుక మనోధర్మములను నిర్ణయించు టెట్లు? అను నంశముల బోధించుట రాజయోగమునకు ముఖ్యోద్దేశము.'

హేతువాదమున కందని విషయములన్నియు అశాస్త్రీయములని పోద్రోయు పాశ్చాత్యులకు యోగ సిద్ధాంతముల సహేతుకముగ విశదపరచి వారిని మెప్పించిన వివేకానందులవారి యీ యుపన్యాసములు చదువుట కెంతేని ఇంపుగ నున్నవి. అనువాదము రసవంతముగనున్నది. యోగమునం దాసక్తులైనవారి యుపయోగార్థము ద్వితీయభాగమున పాతంజలయోగ సూత్రములును, వాటికి ధారాళమైన యనువాదమును చేర్చియున్నారు. డబులుక్రౌను 300 పుటలు వెల రు. 1-4-0.

# గ్రంథ సమీక్ష

## తేనెటీగల పెంచుట—తేనెకూర్చుట

రచయిత శ్రీయుత చక్రవర్తి నయినార్, కోళప్పలూరు పోస్టు, ఉత్తరఆర్కాటుజిల్లా. వెల 0-8-0.

ఇది కుటీర గ్రంథమాల రెండవ గ్రంథము. తేనెటీగలను పెంచుట కుటీర పరిశ్రమగా నభివృద్ధి బొందవగు నని రచయిత ఉద్దేశము. ఇందు పరిశ్రమ చేయుటకు కావలసిన సమస్త విషయములేగాక, ఆ పారిశ్రామికు లెఱుగదగిన వాటినిగూర్చిన సర్వ విషయములు స్పష్టముగ వివరింపబడినవి. తెలియనివారుకూడ నీ పరిశ్రమ ప్రారంభించుట కుత్సాహము గలిగించురీతి నీ గ్రంథము రచించింపబడినది. పరిశ్రమాభివృద్ధి గోరువారెల్లరు చదువతగినది.

## పరాధీన భారతదేశము

గ్రంథకర్త శ్రీయుత దేశిరాజు రామచంద్రరావు గారు, వకీలు, రాజోలు, తూ. గోదావరిజిల్లా. వెల అరణాలు.

పరాధీన భారతదేశమందలి ఆర్థిక రాజకీయ పరిస్థితులు జన సామాన్యమునకు తెలుపుటకై యీ గ్రంథము రచింపబడినది. రచయితయుద్దేశము ఆర్థిక విషయమున నెరవేరిన దనవచ్చును. ఈ చిన్ని పొత్తమును జదివినవారు, భారతదేశము పూర్వమెంత భాగ్యముతో తులదూగుచుండెడిదో, ఆంగ్లేయులు వచ్చిన తరువాత భారతదేశ పరిశ్రమలు నశించి, విదేశములకు ధనమెటుల ప్రవహించినదో, ప్రకృతము దేశము దినదినము దరిద్రమగుట కారణము లెట్టివో, ఇప్పటికి భారతమాత రక్తమెటుల పీల్చబడుచున్నదో, బాగుపడవలసినచో స్వరాజ్య సంపాదన యెందుకు అవసరమో తెలియును.

జనసామాన్యమున మన రాజకీయార్థిక విషయముల సులభముగ తెలుపబూనిన రచయిత శ్లాఘనీయులు. వీరింకయు నిట్టి కృషిచేయుదురు గాక.

## తెలుగు

ప్రతి సోమవారము శుక్రవారము రాజమండ్రినుండి వెలువడు ద్వైవార పత్రిక. సంపాదకులు శ్రీయుత గాడేపల్లి సూర్యనారాయణశర్మ గారు. విడిప్రతి అర్థణా. సాలుచందా రు. 3.

కాంగ్రెసు ఇంకను వ్యాప్తి చెందవలసిన యీ దినములలో కాంగ్రెసు ఉద్యమమును బలపరచుచు పత్రికలు వెలువడుట ముదావహము. ఈ పత్రిక జాతీయోద్యమవ్యాప్తియే మనసునం దుంచుకొని వెలువడుచున్నది. సంపాదకీయములం దొకచో, కాంగ్రెసు కార్యక్రమమును జనసామాన్యము ఎఱుగనందున దురభిప్రాయములు పెరుగుచున్నవనియు, రాష్ట్రమునందంతయు విస్తరించియుండు శాసనసభ్యులాది కాంగ్రెసు వాదులా దురభిప్రాయముల నిర్మూలింపకుండుట శోచనీయమనియు వ్రాయుచున్నది. (3-6-38) కార్యభారముచే విడువబడిన ఇట్టి విషయములను చూపెట్టి కాంగ్రెసు దృష్టి సక్రమ మార్గమును బట్ట ప్రోత్సహించుచు ఈ పత్రిక అభివృద్ధి పొందుగాక.

## అహింసా ప్రచారిణి

బొంబాయి జీవదయామండలివారి ప్రోత్సాహమున జోశ్యభట్ల సత్యనారాయణగారి సంపాదకత్వమున హుసనాబాదా, తూ. గో. జిల్లానుండి వెలువడు తెలుగు మాసపత్రిక. డబుల్ క్రౌను 1/4 పుటలు. సాలుచందా 1-8-0

ఇందలి వ్యాసములు వార్తలుకూడ జీవకారుణ్యము, మద్యపాననిషేధమును ప్రచారణము చేయునవై యున్నవి. ఈ రెంటికిని యెక్కువ ప్రచురణ అవసరమై యున్న కాలమున వెలువడిన యీ పత్రిక వాటికొఱకై ద్విగుణీకృతోత్సాహముతో కృషిచేయునని యెంతుము. అహింసాతత్త్వమునెడ గౌరవము గల వారందరు పత్రికను ప్రోత్సహించి, ఆ సిద్ధాంతమును వ్యాపింప పాటుబడెదరుగాక.

## భారతశక్తి

శ్రీయుత రఘునాథాచారియర్ బి. ఎ. (అనర్స్) గారి సంపాదకత్వమున The Renaissance Research Institute పక్షమున ప్రతిమాసము పదియవ తేదీ పుంగ

నూరు (చిత్తూరుజిల్లా) నుండి వెలువడు ఆంధ్ర—ఆంగ్ల పత్రిక.

'గ్రామ పునర్నిర్మాణము, రయితు ఋణబాధ నివృత్తి, స్త్రీల యభివృద్ధి, నిరుద్యోగసమస్యానివారణము, విజ్ఞాన ప్రబోధము' ఈ పత్రికయొక్క యుద్దేశములు.

ఇందులోని 'దేశరక్షణ' 'భారతజాతీయ నౌకా పరిశ్రమ' 'నిరుద్యోగ సమస్య' 'ఆంధ్రరాష్ట్ర సమస్య' వంటి వ్యాసములా యాశయముల కొంతవఱకు సమర్థించుచున్నవి. ఆశయములకు తగిన రచన లీ సంచికయం దెక్కువగ లేకుండుట ఇది ప్రథమ ప్రయత్నమై యుండుటచే. చిత్తూరు మండలమున పత్రికావశ్యకత మిక్కుటము. అట్టి మండలమున బైలుదేరిన యీపత్రిక తన ఆశయముల ననుసరించి జనసామాన్యమున కుపకరించురీతి పాటుబడవలయును. ఇందలి వ్యాసములలో చాలవఱకు అనువాదములవలె గన్పడుచున్నవి. వ్యాసములం దనవసరముగ ఇంగ్లీషు పదములు ముద్రింపబడినవి. ఆంగ్లభాషయందు ప్రచురింపబడిన ఆంగ్లవ్యాసమెవరికిని ఉపకరించునటుల దోచదు. పైగా ప్రచారమున కుపయోగించుచున్నటుల గాననగును. విడిప్రతి నాలుగణాలు. సాలుచందా రు. 3. ఛందా ఎక్కువగా గన్పడుచున్నది.

## జయభేరి

శ్రీయుత అనుముల వెంకటశేషకవిగారి సంపాదకత్వమున, కర్నూలునుండి వెలువడు మాసపత్రిక. విడిప్రతి 0-1-6 సాలుచందా రూపాయ. సంపాదకీయమునుబట్టి నిది ప్రథమసంచికగా గనపడుచున్నది.

ప్రారంభములోనే 'సారస్వత, సాంఘిక, మత, రాజకీయముల చర్చించుమాసపత్రిక రాయలసీమయం దిది యొక్కటే'యని వ్రాయబడినది; కాని సంచికయం దావిషయమై శ్రద్ధవహించినటుల గానరాదు.

సంపాదకులు సంపాదకీయమునందు చూపినంత యుత్సాహము, లోని వ్యాసములకూర్పునందు చూపలేదు. వారుత్సహించినటుల రాయలసీమకు సేవచేయ గోరుచో నింకను చాల శ్రద్ధవహింపవలెను. ఇందలి భాష చాలవరకు సర్కారుల వాడుక భాషయై యున్నది. ఆశయమేమో?

## ఆయుర్వేద ప్రభాతము

శ్రీయుత ఆయుర్వేదాచార్య తేజోమూర్తుల గురునాథంగారి సంపాదకత్వమున తూర్పు గోదావరిజిల్లా దేశీయవైద్యసంఘము తరఫున రామచంద్రపురము నుండి ప్రచురింపబడు మాసపత్రిక. సాలుచందా రెండు రూపాయలు. విడిప్రతి వెల తెలియదు.

ఇది 'ఆయుర్వేదాభివృద్ధికిని సత్యవిషయ ప్రచురణమునకు' ఉద్దేశింపబడిన పత్రిక. ఈసంచికయందు 'వైద్యధర్మము' నందు వైద్యుడు తనకళ్యాణమునకు గాక లోకకళ్యాణమున కెటుల బాటుబడవలెనో చర్చింపబడినది. ఈధర్మమిపుడు, పూర్తిగా మరుగుపడి యుండుట చింత్యము. 'ద్రాక్షాసవము' 'కాయకల్ప చికిత్స'వంటి వ్యాసములు వైద్యులకుపకరించును. 'వైద్యచాటువులు' సాధారణులకుగూడా నుపకరించును. సత్యవిషయములనే ప్రకటించి జనసముదాయము బాగుపడుటకు పత్రికపాటుపడునని నమ్మెదము.

## వినోదవాణి

శ్రీయుత డా. పి. శేషగిరిరావుగారి సంపాదకత్వమున తిరుపతినుండి ప్రతి 15వ తేది వెలువడు మాసపత్రిక, సాలుచందా 1-8-0, విడిపత్రిక 0.1-6.

రెండవ సంచిక మాకందినది. వినోదముగా వ్రాయ ప్రయత్నించిన చిన్నచిన్న కథలే ఇందెక్కువగా గలవు. వినోదమునకని అసభ్యపువ్రాతలకు ఈపత్రిక చోటీయకుండుట ముదావహము. సాంఘికజీవితము నందలి చెడుగులనెల్ల నెత్తిచూపి జనులు తమ తప్పిదములను తామే నవ్వుకొని సంస్కరించుకొనురీతి యీపత్రిక పాటుపడునని విశ్వసింతుము.